లీగల్ అడ్వైస్

"దివాంజీ వేంకటప్పయ్య పంతుల్ని తీసి వేశా" మన్నారు రాయణింగారు. దివాణంలో అతను మొదట చిన్నగుమాస్తాగా ప్రవేశించాడని వినికిడి. క్రమాంతరాలమీద అతను దివాంజీ అయిపోడమున్నూ రాయణింగారికి వినికిడే.

అసలు, వేంకటప్పయ్య కళ్లయెదటే పుట్టారు రాయణింగారు.

రాయణింగారి పెరుగుదలా చదువు సంధ్యలూ వెంకటప్పయ్య చేతిమీదిగానే జరిగాయి.

మహారాజు అకాలమరణం వాతపడడంవల్ల, రాయణింగారి వివాహమూ, పట్టాభిషేకమూ కూడా. మహారాణికి కొన్ని చెప్పీ కొన్ని చెప్పక. మరివొకరీ ప్రమేయం సుతరామూ లేకుండా, తన యిష్టానుసారం వేంకటప్పయ్యే జరిపించేశాడు.

ఇటు పట్టాభిషేకం అయింది. అటు రాజకార్యాలన్నీ స్వయంగా రాయణింగారే నిర్వహించుకోసాగారు.

అయితే, చెలామణీ మాత్రం వేంకటప్పయ్య మాటలే.

వేంకటప్పయ్య అంటేనే జనులకు గడగడ.

ఈస్థితిలో అన్నారు. రాయణింగారు అతణ్ణి తీసివేశా మని.

వెంకటప్పయ్య నగుమొగంతోనే యింటికి వెళ్ళిపోయాడు.

ఊరంతా మాత్రం రిచ్చపడిపోయింది.

దివాణం అంతా చకితమున్నూ అయిపోయింది.

గ్రామాలలో ఆశ్చర్యసంభ్రమాలు అల్లుకుపోయాయి.

"రాయణింగారు కృతఘ్ను" లనుకున్నారు కొందరు.

"వెంకటప్పయ్య రాజద్రోహి" అని డప్పె వేశారు చాలామంది.

మొదటమొదట వేంకటప్పయ్యతో కలిసీ తరవాత్తరవాత అతని చేతికిందా, పనిచేసిన ముసలిగుమాస్తా అప్పలనరసయ్య, "వేంకటప్పయ్య ఆస్తి పదిలక్షల పైచిలుకు" అని సోపపత్తికంగా నిరూపించాడు.

వేంకటప్పయ్యకి పర్సనల్ గుమాస్తాగా పనిచేస్తూ, అతని పతనంతో అమాంతంగా "దివాంజీవా" రయిపోయిన రామసుబ్బయ్య "వేంకటప్పయ్య హయాములో బొక్కిసం నిలవయెప్పుడు చూసినా వందలలోనే వుంటూ వచ్చింది" అని లెక్కలతో చూపించాడు.

రాజకుటుంబం చిన్నది. రాయణింగారు బహుపొదుపరులు. ఆదాయమా, మూడులక్షల పైని. ఇది తెలిసినవారు, వెంకటప్పయ్య ధైర్యసాహసాలకు గుండెలు కొట్టుకున్నారు.

2

"రైతయినవా డొక్కడయినా మన యెదుటికి రాడేమీ?" అని సందేహం పట్టుకుంది రాయణింగారికి.

"వెంకటప్పయ్య పంతులుగారు వాళ్లని కాళ్లతో రాసేశారు" దివాణం ధరిమానాకు వస్తే మాడ్చేస్తా" నని హుంకారమున్నూ చేశారు. అంచేత, వాళ్ళు, అప్పుడు ఏలినవారి కంట పడలేకపోయారు. నేను వచ్చాక ఆపద్ధతి అంతా మార్చేశాను. ఏలినవారిక విన్నవించుకోవలసిన చిక్కులే లేవు వాళ్లకి. అంచేత యిప్పుడున్నూ వాళ్లు తమకంటపడడంలేదు మహాప్రభూ" అంటూ సర్దిచెప్పారు రామసుబ్బయ్య.

రాయణింగారు నమ్మలేకపోయారు.

"వెంకటప్పయ్య చేతికింద మసిలినవాడు రామసుబ్బయ్య. జిత్తులు బాగా నేర్చివుంటాడు" అనుకుంది రాయణింగారి బుద్ధి.

ఆలోచనలో- పడ్డా రాయన.

రాయణింగారిని గురించి "కుర్రకుంక" అనుకుంది రామసుబ్బయ్య బుద్ధి.

తన ప్రతిభ కళ్లెం సడలించాడతను.

సరిగా. ఈ క్షణంలోనే "దివాంజీపదవి దొరికా లంటే యిదే జాగ్రత్తపడవలసిన ఘట్టం" అనుకుంది. రామసుబ్బయ్య పర్సనలు చెంచుపున్నయ్య బుద్ధి.

నిద్రాహారాలు మరిచిపోయా డతను.

సంవత్సరం తిరిగింది.

"ఇనప్పెట్టి పరిశీలించండి మహాప్రభూ" అని విన్నవించుకుని, ఇట్టా రాయణింగారి యెదట వుంచాడు రామసుబ్బయ్య.

చూడగా, చిట్టానిలవా సంచినిలవా సరిగా సరిపోయివున్నాయి.

ఎప్పుడూ వందలకు మించి యెరగని బొక్కసం లక్షరూపాయల పైచిలుకుతో మిల మిలా మెరుస్తోంది.

"చూసుకోండి నా స్వామిభక్తి" అన్నట్టు రామసుబ్బయ్య కళ్లున్నూ మెరిశాయి: కాని రాయణింగారు సంతోషం కనపరచలేకపోయారు.

"అదంతా తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం" అనుకున్నాడు రామసుబ్బయ్య: కాని వొకనాడు, ఆఫీసుకి అప్పుడేవచ్చి పాగా తీసి టేబిలు మీద పెడుతూ వుండగా

"ప్రభువు, ఫలానా ఫలానా- నలుగురు గుమాస్తాలను తరుచు సన్నిధికి పిలిపించుకుంటున్నా" రని చూచాయగా తెలిసింది.

దానిమీద, పెద్దకాసాభైరన్న తరుచు తమ వీధికి వచ్చి యెదంయెడంగా తచ్చాడుతున్నాడనీ, ఒకనాడు మధ్యాహ్నం జీతాల గుమాస్తా భార్య తన యింటికి వచ్చి "అన్నంచాలక మాడి పోతున్నాం, పంతులుగారితో చెప్పి మీరు కటాక్షించాలి" అని ప్రాధేయపడుతూ, ఆపూట ప్రతీ పనిలోనూ తనభార్యకు సాయంచేస్తూ యిల్లంతా కూడాకూడా తిరిగిం దనీ, వినివుండిన మాట జ్ఞాపకం వచ్చిం దతనికి.

తన చర్య అంతా తన పర్సనల్ గుమాస్తా వోరకంట చూస్తూనే వున్నట్టున్నూ హఠాత్తుగా సందేహం కలిగిం దతనికి.

కుర్చీకి చేరబడిపోయాడు, వెంటనే.

ఆవేళ ఆఫీసులో వున్నంతసేపూ పని మానేసి అత నాలోచనతోనే కాలం గడిపాడు మొత్తానికి.

సంతకాలకోసం వచ్చిన ప్రతిగుమాస్తానీ "రేపు చూద్దాం" అని వెంటవెంటనే పంపేస్తూనూ వచ్చా డతను.

అంతే.

సాయంత్రం యింటికి బయలుదేరుతూ టేబిలుమీద పాగా అందుకునే సమయాన, వొక గుమాస్తా వచ్చి "నిన్ను కొలువులో నుంచి తీసివేశాం" అన్న కాగితం చేతబట్టి, పెదవులు విరుచుకుంటూ కళ్లు చికిలించుకుని వెళ్లిపోయాడు.

ఉత్తరక్షణంలో దివాంజీదర్జాతో వచ్చి, చెంచుపున్నయ్య టేబిలు అంచున కూచుని తాళాలకోసం చెయ్యి చాపాడు, చురుగ్గా చూస్తూ.

ఉసూరుమంటూ బయలుదేరాడు రామసుబ్బయ్య.

"నన్ను ముట్టుకోకు నామాలకాకీ" అన్నట్టు చూస్తూ పక్కపక్కకి తప్పుకున్నాడు బిళ్లబంట్రోతు.

"పౌర్ణమినాడు ఇటు చంద్రోదయమూ అటు సూర్యాస్తమయమూ వొక్కమాటే" అన్నాడొక గుమాస్తా అటుచూస్తూ.

"ఆపోలిక బాగా లేదు. రామసుబ్బయ్యగారి బొళ్లపెట్టి లక్షరూపాయలతో నిండాకే దివాణం బొక్కసంలో లక్షరూపాయల చేరిక" అన్నాడు మరొక గుమాస్తా, కనుబొమలెగరవేసుకుంటూ.

3

"జాగ్రత్త" అని హెచ్చరించి, స్వయంగా దివాంజీకుర్చీలో కూచోపెట్టారు చెంచు పున్నయ్యని, రాయణింగారు.

"చిత్తం చిత్తం, చూస్తూనే వున్నాను మహాప్రభూ" అని వంగి విన్నవించుకుని, రాయణింగా రలా వెళ్ళిపోగానే యిలా వెన్ను విరుచుకున్నాడు చెంచుపున్నయ్య.

గుమాస్తాలందరూ చుట్టూ చేరి, చిరకాలంగా అనుభవంలో వుండిన "నువ్వు" అన్నమాట రాకుండా ఛాలా జాగ్రత్తపడి "ముఖస్తుతి చెయ్యడం కాదు. ఇన్నాళ్ళకు నీతివేత్త అధీనం అయింది దివాంజీ పదవి" అని ప్రశంసించారు.

"నీతివేత్త" అన్నమాట చెవిని పడేటప్పటికి "ఆత్మోదయః పరగ్లానిర్ద్వయం నీతి" అన్న మాఘుని సూక్తి మెరుపు తీగలాగ కళ్ళయెదట మెరిసిన ట్టయింది చెంచు పున్నయ్యకి.

ఆ మెరుపు అతని మొగాన గప్పుమంది.

"చూడండీ" అంటూ వెంటనే ఆవేశంతో ప్రారంభించా డతను.

"వెంకటయ్యపంతులు పెద్దమొత్తం సంపాదించా డనే వొప్పుకుందాం. కనక, వుద్యోగం పోయినా దర్జాగానే కాలం గడపగల డనిన్నీ అంగీకరిద్దాం. మరి ఆయనకు జరిగిన అవమానం తక్కువదా? లక్షలు గడించడమే పరమార్థామా? భిక్ష మెత్తుకుంటే గడిచిపోదూ జీవితం? అవమానం కంటే మరణమే మంచిది కాదూ? రామసుబ్బయ్య. ఆయన అవస్థ చూసిన్నీ నీతిగా వుండలేకపోయాడు. నలభై సంవత్సరాలుగా దివాన్గిరీలో పాతుకుపోయిన వాణ్ణే పెల్లగించి పారేసిన ప్రభువుకి, సంవత్సరం దివాంజీపదవి వెలిగించినవా డొక లెక్కా జమా? నూరురూపాయల జీతగా డొక్క సంవత్సరంలో లక్షరూపాయలు చేర్చడం కంటే ఘోరకలి యేమయినా వుందా? రాజు ద్రవ్యం హరించడమే కాదు, ప్రజలను పీడించి లంచాలు మెయ్యడమూ పశుకృత్యమే, "రాజ్యాంతే నరకం ధ్రువం" అన్నారు పెద్దలు. అయితే, రాజును గురించి మాత్రమే వా రలా చెప్పి వూరుకోడం బాగాలేదు. అసలు, అది, పూర్ణమైన సూక్తి కానేకాదు. నేను చెప్పే దేమంటే? రాజుకీ కాదు. దారితప్పితే రాజసేవ చేసినవాడికిన్నీ నరకం తప్పదు. కనక, మనం జాగ్రత్తగా వుండాలి. నామట్టుకు నేను, పొట్టగడవక యీపదవి స్వీకరించడం లేదు. మంత్రిపదవి మహోన్నతం కాని నీచం కాదని నేను ఋజువుచేసి చూపిస్తాను. గుమాస్తాగా వుండి పైకి వచ్చిన ప్రతీవాడూ గడ్డిమేసే వాడు కాలే దని నిదర్శనం చూపించా లని నేను నిశ్చయించుకున్నాను. దివాంజీ అయినవాడల్లా రాక్షసవృత్తి అవలంభించలే దని రైతులకు విశదం చెయ్యడానికిన్నీ నే నీపదవి స్వీకరిస్తున్నాను. నా వూనిక పరమపవిత్రమైనది. నా పూర్వుల తపస్సు నాకు అండగా వుంటుం దని నే నెరుగుదును. మన మందరమూ ప్రభువు ద్రవ్యం తిని జీవిస్తున్నాం. చాలకపోతే చెప్పుకుందాం చెమట వోడ్చి పనిచేసి, వారి హృదయం కరిగించి, వారి అన్నంలో భాగం పుచ్చుకుందాం. తెలిసిందా? మనకి వంకరదారులు వద్దు. ఎవడయినా సరే, తప్పుదారి తొక్కాడా, నేను మారణం చేసేస్తాను."

మాట ముగియడం తడవుగా కూచున్నా డతను కూచోడం తడవుగా కలం పుచ్చుకుని "ఇదిగో రాజీనామా కాగితం రాసేస్తున్నాను. సేవ ప్రధానమైన వాడి చిత్తశుద్ధి కింతకంటే నిదర్శనం మరి లేదు. ఇదెప్పుడూ నా జేబులో వుంటుంది.

ఉండడమే కాదు. ఎప్పుడు ప్రభువు చెయ్యి అలంకరిస్తామా అని నిరీక్షిస్తూనే వుంటుంది. నన్ను నమ్మి ప్రభువు నన్నింతవాణ్ణి చేశారు. ఈశ్వరుణ్ణి నమ్మి నేను ప్రభువునూ, ప్రజలనూ సేవించుకుంటాను" అని చెబుతూ రాత ముగించి, సంతకమున్నూ చేసి, మడిచి చక్కని కవరులో వుంచి జేబులో పెట్టుకున్నాడు.

దానిమీద యేమి చెయ్యాలోతోచక తక్కిన గుమాస్తాలందరూ మొగమొగాలు చూసుకుంటూవుండగా, అప్పల నరసయ్య అందుకుని "తమరు కొత్తశకం ప్రారంభిస్తున్నారు. చాలాచాలా సంతోషం. ఏమంటే? ఇంతవరకూ ఈ దివాణంలో దివాన్గిరీ చెలాయించినవారు తమలాగ వొక్కరయినా ఝుమాయించి యిలా మట్లాడ గలిగారా? పదవీ స్వీకరణం చేసిన శుభసమయాన, కింది గుమాస్తాల కిలాగ ధర్మబోధ చెయ్యా లనీ, లోకాని కిలాగ సందేశం యివ్వాలనీ, మొదట్లోనే తమ విశాలహృదయం యిలాగ తెరిచివెయ్యాలని వారిలో యెవరి కయినా తోచిందా? రాజీనామా కాగితం రాసి జేబులో సిద్ధంచేసి వుంచుకోడం దాకా యెందుకూ, దాని పవిత్రత అయినా వారికి అవగాహన అయిందా? నేను నిజం చెబుతున్నాను. వారికి పదవే ప్రధానం. తమకు పరువే ప్రధానం. దివాంజీపదవి తమ దృష్టిలో వొక గడ్డిపరక. పూతిక పుడక, పూతిక పుడకను, నావంటి ముసలివాడు భోజనం చేశాక పళ్లు కుట్టుకోడానికి స్వీకరిస్తాడు. తమరు లోకంలో అక్రమాలులేకుండా తుడిచివెయ్యడానికి స్వీకరించారు. కనుకనే, ఇంద రుండగా ప్రభువుదృష్టి తమమీద పడింది. తమరు ధన్యులు. తమకు చేతికింది కింకరులం కాగలిగినందులకు మేమున్నూ ధన్యులమే. మన జమీందారీ యిక నిత్యకల్యాణం పచ్చతోరణంగా భావిస్తుంది. సందేహం లేదు" అని సవినయంగా చెప్పాడు. మాటిమాటికీ అంజలి బంధం నుదుటి కానించుకుంటూ.

ఇంత గ్రంథం జరిగినా ఒక్క గుమాస్తా అయినా కరతాళధ్వనులు చేసిన పాపానపోలేదు. అందుకు, మొదట, చాలా కటకటపడి, తరవాత "కూపకూర్మాలు. వీళ్ళ కేం తెలుసునూ?" అంటూ జాలిపడి. చివరికి, వాళ్లకి బుద్ధి రావాలని టేబిలు అదిరేటట్టు తానే రెండుమాట్లు చరిచి, దివాంజీదర్జా పుణికి పుచ్చుకున్నాడు చెంచు పున్నయ్య.

రాయణింగారి కిదంతా తెలిసింది.

సాయంత్రం యింటికి వెళ్ళి. రాత్రి భోజనం చేసి. తానూ తన భార్యా కూడా కొత్త అంతస్థులో అరుబైట నులకమంచంమీద చంటిపిల్ల కావైపునా యీవైపునా కూచుని, కాస్తసేపు ఆమాటా యీమాటా చెప్పుకునేటప్పటికి "జీవితం అంతా దివాంజీపదవిలో గడిపిన వేంకటప్పయ్య టప్పున యెగిరిపోయాడు. ఒక్క సంవత్సరం పూర్తికావడం తడవుగా రామసుబ్బయ్య కూడా ప్రవాహంలో పడి కొట్టుకుపోయాడు. ఇక మన లెక్కయేమిటీ? కనక, జాగ్రత్తపడాలి" అని చెంచు పున్నయ్యకున్నూ దివ్య ప్రేరేపణ కలిగింది.

వ్యవహారం ఆకళింపు చేసుకునే టప్పటికొక నెల గడిచింది.

గుమాస్తాల కందరికీ తరుచు రాయణింగారి పిలుపు వస్తోందనీ, ఎప్పుడూ దివాణం తొక్కి యెరగని వూరి పెద్దమనుష్యులకున్నూ చాలామందికి తరుచు అయాచితంగా రాయణింగారి దర్శనం అవుతోం దనీ చెంచు పున్నయ్యకి ఆకళింపు అయింది.

దినాని కొక స్టేటుమెంటు ప్రారంభించాడతను.

దీంతో మరోనెల గడిచింది.

ఏ గుమాస్తాని రమ్మని గంటకొట్టినా "వర్తమానం రాగా ప్రభువు సన్నిధికి వెళ్ళి వున్నా" రని మరో గుమాస్తా వర్తమానించడమూ, తన గది గుమ్మానవుండే నౌకరుతప్ప తరుచు మరొకడు కనపడకపోవడమూ, కనపడినా, రాయణింగారి పేరు చెబుతూనే దాటిపోవడమూ, బాహాటంగా ప్రారంభం అయింది.

ఈ స్థితిలో మూడోమాసం గడిచింది.

షరాబు వచ్చి అప్పుడే జీతం సమర్పించుకుని వెళ్లాడు.

అతని వెనకనే అప్పల నరసయ్యవచ్చి "బాబూ, రాజీనామా కాగితం జేబులో వుంచుకునే దయచేశారా యివాళ?" అనడిగి. ఇంతలో బైరన్న రాగా తప్పుకున్నాడు.

బైరన్న అయినా, వొక కాగితం బల్లమీద వుంచి చక్కాపోయాడు. పెదవి అయినా కదపకుండా.

విప్పి చూడగా "నిన్ను పనిలోనుంచి తీసి వేశాం" అన్న శ్రీముఖం అది.

కుర్చీలో వున్నవాడు వున్నట్టుగానే కుంగిపోయాడు. చెంచుపున్నయ్య, గుడ్లు తేలవేసుకుని.

అందరిలోనూ చిన్న గుమాస్తా కామన్న వచ్చి "తాళాలు" అని లొకాయించే దాకా యీలోకం యెరగడతను.

4

చార్జీ పుచ్చుకోడం తడువుగా కామన్న కూడా గుమాస్తాల నందరినీ చేర బిలిచాడు.

అదిచూసి, వారు, అతనున్నూ ఉపన్యాసం పేలగొడతా డనుకున్నారు. కాని "మీ రెవరూ నా దగ్గిరికి వస్తూవుండనక్కరలేదు. నౌక ర్లున్నారు. ఎప్పటికప్పుడు కాగితాలు పంపుతూ ఉండండి. అవసరం అయితే నేనే పిలిపించుకుంటాను. ఏ రోజున వచ్చిన కాగితం ఆరోజునే వెళ్లిపోవాలి. రావలసిన కాగితాలుంటే ఠాణాలకు రిమైండర్లు పంపండి. ఉదయం పదకొండు కొట్టేటప్పటికి కచేరీలో వుండాలి. సాయంత్రం అయిదు కొట్టిందా, కచేరీకి తాళాలు పడిపోవాలి. క్షణం ఆలస్యం కావడానికి వల్లకాదు." అని చెప్పాడు కామన్న కచ్చితంగా.

కోరి అప్పల నరసయ్యని పరసనల్‌గా వేసుకున్నాడతను.

ఈ యెత్తేమిటో వొక్క గుమాస్తాకూ బోధపడలేదు.

అప్పల నరసయ్యమాత్రం యెందుకో "సెబాస్" అనుకున్నట్టు తల పంకించుకున్నాడు.

రాయణింగారికిన్నీ యిదంతా తెలిసింది.

ఉలిక్కిపడ్డా రాయన.

ఆయనకూ ఏమీ అర్థంకాలేదు.

"ఏమి పని వున్నా, ఎంత తొందరఅయినా ఎవ రయినా సరే, కాగితాలు పంపుకోవలసిందే గాని స్వయంగా ఆఫీసుకి రావడానికి వల్లకాదు. గుమాస్తాలూ నౌకర్లూ తప్ప మరెవడో ఆఫీసులో అడుగు పెట్టగూడదు" అని రెండోనాడు మరొక ఆజ్ఞ చేశాడు కామన్న.

మున్సబు కరణాలకూ, ఠాణేదార్లకూ, సముద్దార్లకూ, తక్కిన పొరుగూళ్ళ సిబ్బందీకీ గూడా మీ రెవరూ హెడ్డాఫీసు తొక్కి చూడగూడదు. మా ఆజ్ఞ అయితే తప్ప రాజధానికే రాగూడదు. వ్యవహారం అంతా కాగితాలమీదా, అంచె టపాలమీద జరగాలి. ఏమాత్రం ఆలస్యం అయినా మాట తక్కదు" అని ఆ వేళే తాఖీదులు వెళ్ళిపోయాయి.

దేవతాదర్శనం చేసుకోడానికి వచ్చినవారి కేమాత్రం అసందర్భాలు జరిగినా, జరగవలసిన పూజలూ సేవలూ మొదలైనవాటిలో తేడాలూ లోట్లూ ఏమివచ్చినా కఠినశిక్షలు పడతాయని దేవస్థానం సిబ్బందీకి, దుర్వ్యయాలూ, అపహరణాలూ, అసందర్భాలూ ఏమాత్రం జరిగినా భోజనం చేసేవారి కేవిధమైన కష్టంతోచినా చీరేస్తా మని సత్రం సిబ్బందీకీ ఆజ్ఞలు వెళ్ళాయి. తన దగ్గిరికి వచ్చిన ప్రతీ కాగితమూ– చిన్న దయితే, ఉంటే సందేహాలు తీర్చుకుని అప్పల నరసయ్య ఎండార్సు రాయడం– పెద్దదయితే కామన్నే స్వయంగా చదువుకుని ఎండార్సు రాసెయ్యడం – చివరి కన్నిటిమీదా కామన్న సంతకం పడిపోడం – అప్పటి కప్పుడే అవి యెక్కడి వక్కడికి బయలుదేరి వెళ్ళిపోడమున్నూ నిరాఘాటంగా జరిగిపోసాగింది.

తమ సంతకం కావలసిన కాగితం తమ దగ్గిర నిలవవుండిపోతే తమకే రిమైండర్లూ వార్నింగులూ ప్రారంభం కావడమూ, ఏ గుమాస్త నయినా, చివరికి ఏనౌక ర్నయినా ఆఫీసు కాలంలో తమ దగ్గిరికి పిలిపించుకోవాలంటే కామన్నకు చీటీ రాసుకోవలసిన గతి పట్టడమూ, అయినా, వొక్కొక్కప్పుడు కోరిన మనిషి అందకపోడమూ...... రాయణింగారికే యిలాంటి అదుపాజ్ఞలు ప్రారంభం అయిపోయాయి.

ఆఫీసులో పనిచేసేవారి కందరికీ, తమ యిళ్ళచుట్టూ కామన్న నమ్మినబంట్లు ప్రచ్ఛన్నంగా తిరుగుతున్నారని గాలివార్తలందాయి.

అందరికీ వూపిరి నిలిచిపోయింది.

ఈస్థితిలో మొదటినెల గడిచింది.

ఒకటోతేదీని ఆఫీసులో అడుగుపెట్టారు. అందరికీ జీతాలు చేతిలో పడ్డాయి.

అయితే పదోతేదీ దాటితేగాని... అప్పుడయినా దినానికి కొందరు కొందరికే గాని అందని జీతాలు మొదటితేదీనే అందినందుకు సంతోషించడమా, జేబులునిండే పైపంట మాడిపోయినందుకు విచారించడమా?

ముందు, గుమస్తాల కందరికీ ముచ్చెమటలూ పోశాయి.

తరవాత, నౌకర్లకు ప్రాణాలమీదికి వచ్చింది.

చివరికి, కాసాలకున్నూ గుడ్లుమీది వచ్చాయి.

రెండో నెల కూడా-గడిచింది.

కృతయుగం అయిపోయి మరీ గడిచిందది.

మళ్ళీ మొదటితేదీనే జీతాలు చేతికివచ్చాయి.

కాని, యేమిలాభమూ. నలుసయినా అంటి వుండకుండా కడిగివేసిన రూపాయ లవి.

అయినా యెలాగో సరిపెట్టుకుందా మంటే రక్తమున్నూ పీల్చేసిన రూపాయ లవి.

అందరూ కటకటలాడిపోసాగారు.

గుంపులు కూడసాగారు.

గుసగుసలు పోసాగారు.

కామన్న దివా నయి వున్నంతకాలమూ మాపని యింతే అని వారు నిరాశచేసుకున్నారు.

ఆలోచనలు ప్రారంభించారు.

ప్రచారాని కందుకున్నారు.

సాయంత్రం అయి దయిందంటే, దగ్గిరవుండి స్వయంగా ఆఫీసుకి తాళాలు వేయించి గుర్రబ్బండిమీద ఇంటికి వెళ్ళిపోతాడు కామన్న.

అప్పల నరసయ్య కూడా పాత సైకిలు తొక్కుతూ దిగుతూ చక్కాపోతాడు.

గుమాస్తాలూ నౌకర్లూమాత్రం, కామన్న వెళ్ళేదాకా వెదుతున్నట్టే వెడుతూ వెనక్కి వెళ్ళుతారు.

తమ కష్టాలూ, తమ కల్పనలూ రాయణింగారితో చెప్పుకోవాలంటే అంతకంటే మరి వారికి సమయం లేదు.

అయితే, రాయణింగారికి, రాణీగారి వెంట కోటలోనే వున్న పూలతోటకి వెళ్లే సమయం అది.

క్షణం ఆలస్యం అయితే రాణీగారు మహిషాసురమర్దని అయిపోతారు.

కాని, యీ కొత్త దివాంజీ చర్య తమకున్నూ ఉక్కిరి బిక్కిరి కలిగిస్తూ వుండడంవల్ల గుమాస్తాల బాధలూ, నౌకర్ల గోలా యేమిటో విందామని, ఉండుండి ఒక్కనాడు వీలుచేసుకున్నాడు రాయణింగారు.

అందరూ కాళ్లమీద పడ్డారు.

మనిషి కొకమాట, నోటికొక విధం-- ఇంతే భేదం.

మొత్తానికి "కామన్నగారూ డిటో ప్రకారమే మహాప్రభూ" అని పిండితార్థం.

దానికి వన్నెలూ చిన్నెలాను. ఓమాత్రం ప్రతిభావంతులు అవి నమ్మకుండా వుండలేరు.

రాయణింగా రయినా కామన్న వచ్చేదాకా గుమస్తాల మాటలు వేదవాక్కులుగా భావించిన వారే; కాని కామన్న చాకచక్యం అందరినీ విడిచి రాయణింగారి హృదయం క్షాళన చేసేసింది.

దాంతో, రాయణింగారు, గుమాస్తాలకూ నౌకర్లకూ కష్టాలుంటే వుండవచ్చు ననుకున్నారు; గాని కామన్న ద్రోహి అంటే మాత్రం నమ్మలేకపోయారు.

దానిమీద, గుమస్తాలు "మా కష్టాలకేం, అసలు, వొకరి సేవచెయ్యడమె వొక కష్టం. అది యిష్టమయితే తక్కిన కష్టాలు లెక్కకు రావు మామాట కాదు మేము చెప్పుకునేది. కామన్నగారు తడిపాతని గొంతుక్కోసే రకం మహాప్రభూ" అంటూ ప్రారంభించారు.

గుమాస్తాలే కాదు, నౌకర్లే కాదు. కామన్న మొగ మయినా చూడవలసిన అగత్యం లేని వంటవాళ్లున్నూ యిదే మాట.

రాణిగారితో తప్ప మరెవరితో మాట్టాడ్డాని కయినా రాయణింగారికి కంపం యెత్తి పోయింది.

5

"పూర్తి కావడం అంటూ వుందా?" అని వుంచుకుని మరి గడిచిపోయింది. మూడో నెల;

ఎవరి జీతాలు వారికి ముట్టాయి.

అందరికీ జీతా లిచ్చే రాయణింగారికి హాహాకారాలు ముట్టాయి.

భరించలేకపోయా రాయన.

ఒకనాడు కామన్న ఆఫీసుగదికే బయలుదేరారు రాయణింగారు.

కామన్న యెదట కూచుని యేదో కాగితం చూస్తూ ఆలోచన చేసుకుంటున్న అప్పల నరసయ్య, వారిని చూసి "చిత్తం చిత్తం" అంటూ కంగారుపడుతూ లేచి నుంచున్నాడు.

చూడగా, రెండుచేతులా ద్వారబంధం కమ్ములు పట్టుకుని. కొంచెం వంగి లోపలికి చూస్తూ రాయణింగారు.

రాస్తూ రాస్తూ వున్న కాగితం సందుకా పెట్టెమీదే వుంచేసి. కలంమాత్రం చేతిలోనే వుంచుకుని, నిశ్చలంగా లేచినుంచున్నాడు కామన్న.

"కామన్నా!"

"ఏమి సెలవు మహాప్రభూ?"

"కాసికలు చెప్పేవాళ్ల నేమి చెయ్యాలోయ్?"

"ఆ. యేముందిబాబూ. వినేవాడి చెవులు తెగ్గోస్తే సరి"

అప్పల నరసయ్య తుళ్లిపడి చూశాడు.

బిగపట్టుకున్న వూపిరి విడిచి, ద్వారమున్నూ నెమ్మదిగా వదలిపెట్టి, తాపీగా వెనక్కి తిరిగి, బుర్రవంచుకుని వచ్చినదారినే చక్కాపోయారు రాయణింగారు.

(కిన్నెర - సెప్టెంబరు, 1950)